క్లుప్తంగా

వాలీబాల్స్, నెట్స్ బహూకరణ


వాలీబాల్స్, నెట్స్ అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడైన శాంతిరెడ్డి జ్ఞాపకార్థం శాంతిరెడ్డి ఫౌండేషన్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి గురువారం నల్లగొండలోని ఎంజీ యూనివర్సిటీకి వాలీబాల్స్, నెట్స్ బహూకరించారు. కార్యక్రమంలో వీసీ అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, ఆకుల రవి, హరీష్ కుమార్, శివ శంకర్, మురళి, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఆసన కండరాల సమస్యపై అవగాహన ఉండాలి


సమావేశానికి హాజరైన వైద్యులు

నల్లగొండ టౌన్: గర్భిణులకు సాధారణ ప్రసవ సమయంలో వచ్చే అతి కీలకమైన ఆసన కండరాల(మలద్వార కండరాలు) సమస్యపై వైద్యులకు అవగాహన ఉండాలని నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి హెచ్‌ఓడీ డాక్టర్ స్వరూపరాణి తెలిపారు. గురువారం నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జేఅండ్‌జే ఎతికాం కంపెనీ సౌజన్యంతో మొదటిసారి ఇలాంటి కాన్ఫరెన్స్ నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సుమారు 250 మంది వైద్యులు పాల్గొన్నారు.

ఉరుమడ్లలో టీబీ స్క్రీనింగ్ పరీక్షలు

చిట్యాల: టీబీ ముక్త్ భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఈసం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామస్తులకు టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 409 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా వీరిలో ఏడుగురికి ఎక్స్‌రే టెస్టులకు రిఫర్ చేశారు. అవసరమైన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నర్సింగ్‌రావు, టీబీ సూపర్‌వైజర్ అజయ్, సూపర్‌వైజర్ వెంకటరమణ, డాక్టర్ మాధవి, ఏఎన్‌ఎం స్వరాజ్యలక్ష్మి, రిబికా పాల్గొన్నారు.

చండూరు మున్సిపల్ కమిషనర్‌గా మల్లేష్

చండూరు: చండూరు మున్సిపల్ కమిషనర్‌గా మల్లేషం గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా పనిచేసిన ఆయన పదోన్నతి పొంది మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

నకిరేకల్ తహసీల్దార్‌గా యాదగిరి


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్

నకిరేకల్: నకిరేకల్ తహసీల్దార్‌గా యాదగిరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న జుము రుద్దీన్ శాలిగౌరారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శాలిగౌరారం తహసీల్దార్‌గా పని చేస్తున్న యాదగిరి ఇక్కడకు బదిలీ అయ్యారు.

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న నర్సింహారెడ్డి

శాలిగౌరారం: ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డాక్టర్ సీవీఎన్ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధి చామల నర్సింహారెడ్డి కోరారు. టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం శాలిగౌరారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో డాక్టర్ చామల వెంకటనర్సింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. మొలుగూరి కావేరికి రూ.3500లు, మొలుగూరి రూపకు రూ.3500లు, చింతకాయల విజయ్‌కు రూ.3వేలు నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యనభ్యసిస్తున్న పాఠశాలకు చెందిన 2023–24 విద్యార్థిని బొడ్డు యజ్ఞశ్రీకి రూ.3500 నగదు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట మల్లయ్య, ఏపీసీ చైర్మన్ జమ్ము శ్రీలత, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, చాడ యాదగిరిరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలి

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


భవిత సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ: జిల్లా కేంద్రంలో ప్రతీక్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆధునీకరించిన భవిత కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మించిన భవిత కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతులమీదుగా ప్రారంభింపజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సెంటర్‌లో ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సమకూరుస్తామన్నారు. కేంద్రం ఆధునీకరణ, యాక్టివిటీ రూమ్, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఇప్పటికే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.10 లక్షలు ఇచ్చామని తెలిపారు. కలెక్టర్ నిధుల ద్వారా మరో రూ.7 లక్షలు భవిత కేంద్రంపై వెచ్చించినట్లు చెప్పారు. భవిత కేంద్రంలో ఏసీ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి భోజనం పెడుతున్నారని అడగగా, పౌష్టికాహారంతోపాటు, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నామని సెంటర్ నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు వారానికి రెండుసార్లు స్పీచ్ థెరఫీ ఇచ్చేందుకు అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు మంత్రి చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఈఓ భిక్షపతి, ఎంఈఓ అరుంధతి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు రహదారుల సౌకర్యం


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): అన్ని గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ మండలం అప్పాజీపేట నుంచి మిర్లోనిగూడెం వరకు నిర్మించనున్న బీటీ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ముఖ్యంగా అన్ని గ్రామాల్లో చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామ చెరువు కట్ట పటిష్టతకు అంచనాలు రూపొందించి పంపించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఈఈ గిరిధర్, డీఈ రమేష్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక రవాణాకు అనుమతించాలి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వాగుల నుంచి ఉచితంగా ఇసుక రవాణా చేసుకునేందుకు అధికారులు అనుమతి ఇవ్వాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన మునుగోడులోని క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. అక్కడి నుంచే పలువురు అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడారు. పెరిగిన ధరల కారణంగా పేదలు ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేసుకోవడం కష్టంగా ఉందని, కనీసం స్థానికంగా లభించే ఇసుకను ఉచితంగా ఇస్తే కాస్త వెసులుబాటు కలుగుతుందన్నారు. మానవతా దృక్పథంతో తక్కువ ధరకు కంకర ఇవ్వాలని పలు కంకర మిల్లుల యజమానులకు ఫోన్‌చేసి కోరారు.

బెల్టు దుకాణాలను మూసివేయించాలి

గ్రామాల్లో యువకులు, పెద్దలు మద్యానికి బానిసలు కాకుండా గతంలో బెల్టు దుకాణాలు మూసివేయిస్తే తిరిగి కొందరు దొంగచాటుగా మద్యం విక్రయిస్తున్నారని, పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని వాటిని పూర్తిగా మూసివేయించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి ముదిరాజ్, యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, జాల వెంకన్న, పాల్వాయి జితేందర్‌రెడ్డి, మందుల బీరప్ప తదితరులున్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు


నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, ఎన్‌సీసీ కేడెట్లు


కట్టంగూర్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కట్టంగూర్ : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని కట్టంగూర్ ఎస్‌ఐ రవీందర్ అన్నారు. గురువారం కట్టంగూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అంబటి అంజయ్య, పోలీసు సిబ్బంది మునాస సత్యనారాయణ, శంకర్, రాంమోహన్, సైదులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించాలి

రామగిరి(నల్లగొండ): మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. గురువారం నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరిలో చైతన్యం కల్పించేందుకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సీహెచ్. సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కోటయ్య, డాక్టర్ మల్లేశం, అనిల్‌కుమార్, శివరాణి, సావిత్రి, ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


చండూరులోని డాన్‌బాస్కో జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చండూరు: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్‌ఐ కురుమనాయకులు అన్నారు. గురువారం చండూరులోని డాన్‌బాస్కో జూనియర్ కళాశాలలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విల్సన్, ఎక్సైజ్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: యువత గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కేతేపల్లి ఎస్‌ఐ సతీష్ కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కేతేపల్లిలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ రాఘవేంద్ర, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే మందుల సామేల్


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం శాలిగౌరారం మండలంలోని రామగిరి, శాలిలింగోటం గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీరుద్దీన్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగె నర్సింహ, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కార్యదర్శి గూని వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండపల్లి కొమరయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులకు పార్టీ కండువా కప్పుతున్న భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని 47వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అంబటి నాగరాజు ఆ పార్టీకి రాజీనామా చేసి తన సహచరులతో కలిసి గురువారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు అడ్డగోలుగా వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పట్ల తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, సీనియర్ నాయకులు సింగం రాంమోహన్, పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, రంజిత్, అనిల్‌నాయక్, జైచందన్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న నరేందర్

కేతేపల్లి: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని పతంజలి ఫుడ్స్ నకిరేకల్ డివిజన్ మేనేజర్ నేలపట్ల నరేందర్ అన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన శాఖ, పతంజలి ఫుడ్స్ ఆధ్వర్యంలో గురువారం కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీలు అందించి ప్రోత్సహిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా 12 వేల ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారని తెలిపారు. చీడపీడలు, వానరాల బెడద లేకపోవటంతో ఆయిల్‌పామ్ సాగుపై యువ రైతులు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని, ఖర్చులు పోను ఏటా రూ.1.50 లక్షల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. అంతర పంటలు సాగు చేయటం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, విక్రమ్, రైతులు కోట లింగయ్య, మోదుగు దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గుత్తా మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అందే ఎత్తులో ప్రమాదం


చందుపట్లలో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

నకిరేకల్: మండలంలోని చందుపట్ల గ్రామంలో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. వీటిని సరిచేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలోని రాణి రుద్రమాదేవి విగ్రహం నుంచి తాటికల్ గ్రామానికి వెళ్లే దారిలో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. వరి కోత మిషన్లు, ట్రాక్టర్లు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికరంగా మారింది. గాలి దుమారానికి ఒకదానికొకటి తగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

జూలై 9న సార్వత్రిక సమ్మె

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో ఆశ కార్యకర్తలు, మధ్యాహ్నం భోజన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పోలే సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో డీఈఓ ఆఫీసులో సహాయ సంచాలకులకు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమ్మె నోటీసులు అందజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లందరినీ కార్మికులుగా గుర్తించి సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో అవుట రవీందర్, నరసింహ, సౌజన్య, ప్రేమలత, శోభ పాల్గొన్నారు.

చండూరు: కార్మికులంతా జూలై 9న జరగబోయే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గురువారం చండూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాటాలతో సాధించుకున్న నాలుగు కార్మిక చట్టాలు, నాలుగు లేబర్ కోడ్స్‌ను మార్పుచేయడం దుర్మార్గమన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, స్కీం కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, ప్రజానాట్యమండలి నాయకులు చంద్రమౌళి, సీఐటీయూ నాయకులు ముత్యాలు, ధనుంజయ్, వెంకటేశం, లింగయ్య, లలిత, సైదులు, లింగస్వామి, కలమ్మ, నాగరాజు, యాదగిరి, వెంకన్న, రామలింగాచారి, రాములు, వెంకటయ్య, నరసింహ, రాజునాయక్ పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీఓ సుమలత

కనగల్: మహిళా సంఘాల సభ్యులు ప్రజలను చైతన్యం చేయాలని ఎంపీఓ సుమలత అన్నారు. గురువారం కనగల్ మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల పదాధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో శిక్షకులు నాగలక్ష్మి, ఉమారాణి, ఏపీఎం సంకు హరి, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు రాయల రాజేశ్వరి, గీత, కోశాధికారి సుచిత్ర, సీసీలు పాల్గొన్నారు.

ఆస్తి నష్టం కేసులో నిందితులకు జరిమానా

చండూరు: ఆస్తి నష్టం కల్గించిన కేసులో నిందితులకు జరిమానా విధిస్తూ నల్లగొండ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ గురువారం తుది తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల్ గ్రామానికి చెందిన మోదుగు అల్వాల్‌రెడ్డి తన వ్యవసాయ భూమిలో వేసుకున్న ఫెన్సింగ్, రాతి కడీలు, డ్రిప్ పైప్‌లైన్‌ను అదే గ్రామానికి చెందిన మోదుగు సుఖేందర్‌రెడ్డి, మోదుగు సందీప్‌రెడ్డి, మోదుగు దిలీప్‌రెడ్డి, మోదుగు తిరుమల్‌రెడ్డి, మోదుగు నిర్మలమ్మ ధ్వంసం చేశారని 2017లో చండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి రూ.5500 జరిమానా విధిస్తూ నల్లగొండ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే 4 నెలల సాధారణ జైలుశిక్ష విధించాలని తీర్పులో వెలువరించారు.

పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలి

మునుగోడు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ కోరారు. గురువారం మునుగోడు మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలల వివరాలను మండల విద్యాధికారికి అందజేశారు. స్పందించిన ఎంఈఓ మల్లేషం మునుగోడులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో దుస్తులు, పుస్తకాలు విక్రయిస్తుండగా పట్టుకుని ఆ గదిని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు ఉదయ్, సాయికృష్ణ, నాగరాజు, రాజు, శంకర్, రాంచరణ్, దశరథ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చిట్యాల: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ చిట్యాల పట్టణ కార్యదర్శి కొంపెల్లి సూర్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం చిట్యాల మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వారిలో విద్యార్థి సంఘం నాయకులు చత్రపతి చౌహాన్, హనుమాన్, గణేష్, శివ ఉన్నారు.

పత్తిలో అంతర పంటలు సాగుచేసుకోవాలి

మునుగోడు: రైతులు సాగు చేస్తున్న పత్తిలో అంతర పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మజ సూచించారు. గురువారం మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామంలో పలువురు పత్తి రైతుల పంటలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి పంటలో అంతర పంటగా మినుములు, సోయా చిక్కుడు సాగుచేస్తే ఆదాయం పొందవచ్చన్నారు. పంటల సాగుకు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలన్నారు. ఆమె వెంట ఏఈఓ వెంకటేష్ ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గల మోడల్‌స్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జెరిపోతుల హారికకు గురువారం చీకటిగూడెం గ్రామానికి చెందిన వెంబడి చిరంజీవి రూ.3వేలు, ఎంపీటీసీ దాచేపల్లి నర్మద నాగేశ్వరరావు రూ.2వేలు, బాసాని భిక్షపతి రూ.వేయి ఆర్థిక సాయం అందజేశారు. దాతలను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు సన్మానించారు.

అసత్య ప్రచారం సరికాదు

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకుగాను రెవెన్యూ అధికారులు ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంటే బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులపై అసత్య ప్రచారం చేయడం సరికాదని డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ అన్నారు. గురువారం చిట్యాలలో వారు విలేకరులతో మాట్లాడారు. జడల చినమల్లయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, ఆ పార్టీ నాయకులు అద్దెల లింగారెడ్డి, ఆవుల సుందర్, దేశపాక రాజేష్, కోనేటి కృష్ణ, సిలివేరు శేఖర్, జంపాల వెంకన్న, ఏర్పుల పరమేష్, మల్లేబోయిన మల్లేష్, కోసనం అశోక్, పోకల యేసు, బోడ శ్రీను పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

నల్లగొండ టూటౌన్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి కోరారు. గురువారం నల్లగొండ పట్టణంలోని 18వ వార్డులో మొక్కలు నాటారు. పార్టీ టూటౌన్ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కిషన్, బూత్ అధ్యక్షురాలు సుకేషని పాల్గొన్నారు.

ఒక చోట నిల్.. మరోచోట ఫుల్!


గొల్లగూడెంలో మూతపడిన పాఠశాల


కాశివారిగూడెం పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

- విద్యార్థులు లేక మూసివేయడానికి సిద్ధంగా పాఠశాలలు
- అవగాహన కల్పించినా ప్రభుత్వ స్కూళ్లల్లో చేరని విద్యార్థులు
- మరికొన్ని చోట్ల ఉపాధ్యాయుల కొరత

తిప్పర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించి నాణ్యమైన ఆంగ్ల విద్యను అందిస్తున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో విద్యార్థులు లేక పాఠశాలలు మూతపడే పరిస్థితులు నెలకొన్నాయి. మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. తిప్పర్తి మండలంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు 5, కస్తూరిబా పాఠశాల-1 , ఆదర్శ పాఠశాల -1, ప్రాథమికోన్నత పాఠశాలలు-5, ప్రాథమిక పాఠశాలలు-33 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 2480 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు, పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. మధ్యాహ్న భోజనం, యూనిఫాం ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నటికీ కొన్ని గ్రామాల్లో పాఠశాలలకు విద్యార్థులు రావడం లేదు. తిప్పర్తి మండలంలోని గొల్లగూడెం, కొర్వోనిగూడెం, సోమోరిగూడెం ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థులు రాకపోవడంతో ఆ పాఠశాలలు మూసివేయడానికి సిద్ధంగా ఉన్నాయి. బడిబాట కార్యక్రమంలో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించినప్పటికి ఆయా పాఠశాలల్లో విద్యార్థులు చేరడంలేదు.

> **ప్రయత్నం చేసినా విద్యార్థులు చేరలేదు**
>
> గొల్లగూడెం, కొర్వోనిగూడెం, సోమోరిగూడెం గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ఎంతో ప్రయత్నం చేశాం. కానీ విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపడం లేదు. బడిబాట కార్యక్రమంలో కూడా అవగాహన కల్పించాం. కాశివారిగూడెం గ్రామంలో విద్యార్థులు పెరిగారు. అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. రెండు మూడు రోజుల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.
>
> –నర్సింహనాయక్, మండల విద్యాధికారి, తిప్పర్తి

కాశివారిగూడెంలో సరిపడా లేని ఉపాధ్యాయులు

తిప్పర్తి మండలంలోని కాశివారిగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. కానీ ఉపాధ్యాయులు సరిపడా లేరు. ఆ పాఠశాలలో 63 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. అక్కడ అదనంగా ఉపాధ్యాయుడి అవసరం ఉంది.

చట్టబద్ధత కల్పించకుండా ఎన్నికలు నిర్వహించొద్దు

గట్టుప్పల్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన హామీకి అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహించడమంటే ముమ్మాటికీ బీసీలకు ద్రోహం చేయడమేనన్నారు. బీసీలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని, లేకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మహ్మద్ యూసుఫ్, చండూరు మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సత్తయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

శాలిగౌరారం: శాలిగౌరారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా గుజిలాల్ శేఖర్ బాబు, ఉపాధ్యక్షులుగా దునుక వెంకన్న, యంగలి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, కోశాధికారి గుండు పరమేశ్‌తోపాటు, క్లబ్ గ్యాట్ కోఆర్డినేటర్లను ఎన్నుకున్నారు.

రూ.2వేల కోట్లు కేటాయించాలి

చండూరు: రాష్ట్రంలోని వృత్తిదారుల సంక్షేమానికి ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ. 2వేల కోట్లు కేటాయించాలని వృత్తి సంఘాల రాష్ట్ర నాయకుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం ఆయన చండూరులో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, వివిధ వృత్తి సంఘాల నాయకులు, ధనుంజయ, వెంకటేశం, రామలింగం, లింగయ్య, ముత్యాలు, వెంకటయ్య పాల్గొన్నారు.